ప్రజాశక్తి

సోమవారం 19 ఫిబ్రవరి 2024

5

పార్వతీపురం మన్యం



రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

పార్వతీపురంరూరల్: సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 20న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవ, సిపిఎం నాయకులు బంటు దాసుతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసి, రాజ్యాంగాన్ని ఉల్లంఘించి. ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను కాలరాస్తున్న బిజెపిని, ఆ పార్టీతో జతకడుతున్న టిడిపి, జనసేన కూటమిని నిరంకుశ వైసిపికి వ్యతిరేకంగా తలపెట్టిన ఈ సదస్సులో వామపక్ష, లౌకిక ప్రజాతంత్ర శక్తులు, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం పాటుపడే పార్టీలు, సంఘాలు, సంస్థలు, వ్యక్తులు, శక్తులు సదస్సులో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వై.మన్మధరావు పాల్గొన్నారు.

పిట్టల్లా రాలిపోతున్నారు..

- ఆగని విద్యార్థుల మరణాలు
- వైద్య సేవలు అంతంత మాత్రమే
- సమీక్షలకే ఉన్నతాధికారులు పరిమితం
- కొరవడిన పర్యవేక్షణ



మృతి చెందిన అశోక్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థుల మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు ఏదో ఒక కారణంచేత పసిప్రాయంలోనే మృత్యుఒడికి చేరుతూనే ఉన్నారు. విద్యార్థులు మరణించిన సందర్భంలో మాత్రమే జిల్లా ఉన్నతాధికారులు తూతూ మంత్రంగా సమీక్షలు జరిపి, హడావిడిగా ఆ రెండురోజులు పాఠశాలలను సందర్శించి చేతులు దులుపుకుంటున్నారు. గతంలో అయితే నెల రోజుల్లో నాలుగైదు ఆశ్రమ పాఠశాలలను డిడి, పిఒ సైతం అధికారులు సందర్శించే సందర్భాలు ఉండేవి. విద్యార్థుల మరణాలు అరికట్టడం, వారి మరణాలకు గల కారణాల వంటి వాటిపై విశ్లేషణ పూర్తిగా కొరవడింది. దీంతో విద్యార్థులు ఏడాది పొడవునా ఏదో ఒకచోట చనిపోతూనే ఉన్నారని గిరిజన సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు నెలల్లో ముగ్గురు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మృతి చెందడం బాధాకరం. రక్తహీనత, జ్వరం వంటి లక్షణాలతో విద్యార్థులు మరణించినట్లు వైద్యులు చెబుతున్నారు.

ఉన్నత చదువులు చదవాలని, ఉద్యోగం చేసి తల్లిదండ్రుల కష్టాలను తీర్చాలని కన్న ఆ గిరిజన విద్యార్థులు కలలు కలలుగానే మిగిలిపోయాయి. చదువుకునే పసి ప్రాయంలో వివిధ వ్యాధులతో అనారోగ్యం బారిన పడి నిండు నూరేళ్ల జీవించాల్సిన పసి మొగ్గలు పదహారేళ్లకే మృత్యుఒడికి చేరుతున్నారు. దీంతో ఆ ఇంట విషాదాన్ని నింపుతున్నారు.

జిల్లాలో మక్కువ మండలం ఎర్రసామంత వలస ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థి సీదరపు అశోక్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈనెల 4న పాచిపెంట ఆశ్రమ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ఎన్.శ్వేత, గుమ్మలక్ష్మీపురం మండలం కెడి కోలని ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న బిడ్డిక సీత అనారోగ్యంతో మృతి చెందింది.

వైద్యం కోసం.....

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న 55 ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, సీతంపేట ఐటిడిఎ పరిధిలోని 43 ఆశ్రమ పాఠశాలల్లో వేలాదిమంది విద్యార్థులు చదువుతున్నారు. నిత్యం విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతూ సమీపంలోని ఆసుపత్రులకు వెళ్లడం పరిపాటిగా మారింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యం కోసం వస్తున్న వారిలో ఎక్కువమంది విద్యార్థులే కనిపిస్తున్నారు. వసతి గృహాల్లో ఆరోగ్య కార్యకర్తల పోస్టుల్లేక పోవడంతో విద్యార్థులు వైద్యం కోసం బయట ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకులు చెబుతున్నారు.

ఆసుపత్రుల్లో వైద్య సేవలు అంతంత మాత్రమే....

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు మెరుగుపడలేదు. ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా రోగులకు అన్ని రకాలైన వసతులు కల్పించడంలో మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీంతో వైద్యం అందని ద్రాక్ష గానే మిగిలిపోతుంది.

విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


గిరిజన విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. నాడు-నేడు పనులకు ఇస్తున్న ప్రాధాన్యత విద్యార్థుల ఆరోగ్యం పట్ల చూపడం లేదు. మెరుగైన వైద్యం అందక విద్యార్థులు మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికైనా మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

కోలక అవినాష్
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి.

ఆరోగ్య సిబ్బందిని నియమించాలి

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్లను ప్రభుత్వం నియమించాలి. విద్యార్థులకు వైద్య సేవలందేలా చూడాలి. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి. వారానికోసారి వైద్య శిబిరాలు నిర్వహించాలి. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి.

పల్ల సురేష్
గిరిజన విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ఎన్నికల బాండ్ల విధానం వెనుక

బిజెపి, ఆర్ఎస్ఎస్ రహస్య ఎజెండా

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అత్యంత సంపన్న కార్పొరేట్ కంపెనీల నుండి పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి ఎన్నికల వ్యవస్థను తమకు అనుకూలంగా మలచుకోవడం, మతోన్మాద కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ధనాన్ని పోగుచేయడమనే ఎజెండాలో భాగమే ఎన్నికల బాండ్ల వ్యవస్థ అని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో వామపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బొత్స నరసింగరావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి సంఘం, న్యాయవాది ఎం.వెంకటరమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, నాయకులు బంకూరు సూరిబాబు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కె.రాజు, పి.రాజశేఖర్, సింహాచలం, భాస్కరరావు తదితరులు మాట్లాడారు.

2018 నుండి ఎన్నికల బాండ్ల ద్వారా జాతీయ, ప్రాంతీయ పార్టీలకు రూ.16,437 కోట్ల విరాళాలు అందగా, అందులో రూ.10,117 కోట్లు బిజెపి ఖాతాలోకి వెళ్లాయంటే ఈ విధానం ఎవరి కోసం వచ్చిందో అర్థమవుతుందనీ వాపోయారు. బిజెపి పాలనా కాలంలో కార్పొరేట్, మతతత్వ శక్తుల బంధం బలపడిందని, అది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని చాలా ముందుగానే సిపిఎం హెచ్చరించిందని తెలిపారు. రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకొచ్చిన ఎలక్ట్రోరల్ బాండ్ల పథకం చెల్లుబాటుపై సుప్రీంకోర్టు గురువారం సంచలన తీర్పు ఇచ్చిందని, ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసిందని అన్నారు. ఎన్నికల బాండ్ల జారీని బ్యాంకులు తక్షణమే నిలిపివేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించిందన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవ తీర్పు వారికి చెంపపెట్టు అని అన్నారు. ఇచ్చిన వారి వివరాలు తెలియని ఎన్నికల బాండ్లను స్వీకరించడమంటే సమాచార హక్కును ఉల్లంఘించడమేనని ధర్మాసనం స్పష్టం చేసిందని అన్నారు. ఎన్నికల బాండ్ల విధానాన్ని ప్రారంభం నుండి వామపక్షాలు అభ్యంతరం చెబుతూ చట్టసభల్లో, బయట అనేక రూపాల్లో ఆందోళనలు చేశాయన్నారు. ఇప్పటి వరకు విక్రయించిన ఎన్నికల బాండ్ల వివరాలను మార్చి 6 నాటికి ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని, ఎవరు, ఏ పార్టీకి ఎంత మొత్తంలో జమ చేశారనే వివరాలు మార్చి 13 నాటికి బహిరంగంగా ఉంచాలని ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించిందని అన్నారు. ఈ ఆదేశాలు అమలైతే పాలక బిజెపి లోగుట్టు మరింత రట్టు అవుతుందన్నారు. మతం చాటున, దేశభక్తి ముసుగున సాగింది ఏమిటో కొంతైనా బట్టబయలు అవుతుందన్నారు. బిజెపి విధానం దేశభద్రతకు ప్రమాదంగా మారుతుందని, వెంటనే సుప్రీంకోర్టుకమిటీ ద్వారా ఎన్నికల బాండ్లు మొత్తం స్వీకరించిన బిజెపిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఊరూ పేరు లేకుండా ఇలా కంపెనీలు ఇచ్చే విరాళాలు పూర్తిగా క్విడ్‌ప్రోకో ప్రయోజనాలకు తావునిస్తాయని వక్తలు అభిప్రాయపడ్డారు. బిజెపి బండారం బయట పెట్టేందుకు పెద్ద ఎత్తున సదస్సు నిర్వహించాలని, రౌండ్ టేబుల్ కమిటీ నిర్ణయించింది.

ఈసారైనా టిడ్కో ఇళ్లు ఇచ్చేనా?

20న ముహూర్తం ఖరారు

ప్రజాశక్తి - సాలూరు

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టిడ్కో ఇళ్ల పంపిణీకి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఇప్పటికే పలుమార్లు వాయిదా పడింది. కొద్దిరోజుల క్రితం టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు పరిశీలించారు. వారం పది రోజుల్లో పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కానీ అది జరగలేదు. ఆ తర్వాత రెండు సార్లు వాయిదా వేశారు. తాజాగా ఈనెల 20న పంపిణీ చేయాలని నిర్ణయించారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర ఒత్తిడి మేరకు టిడ్కో ఇళ్లకు సంబంధించి విద్యుద్దీకరణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇంటర్నల్ రోడ్ల పనులు కూడా త్వరితగతిన జరుగుతున్నాయి. 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న వెయ్యికి పైగా ఇళ్లు పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. గుమడాం సమీపానున్న వేగావతి నది నుంచి పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేపట్టారు. అయితే పైపులైన్ నిర్మాణం ఎంపిడిఒ కార్యాలయ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ కింద నుంచి జరగాలి. అది జరగాలంటే రైల్వే అధికారులు అనుమతి ఇవ్వాలి. ఇంతవరకు దీనికి సంబంధించిన అనుమతి మంజూరు కాలేదని తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పైపులైన్ నిర్మాణం ప్రశ్నార్థకంగా ఉంది. రెండు రోజుల్లో పంపిణీ కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా ఇంతవరకు పైపులైన్ నిర్మాణం జరగకపోవడంతో ముహూర్తం మళ్లీ వాయిదా పడుతుందేమోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

49 మంది ఎస్జీటీలకు ఎస్ఏలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్, సత్సమాన కేటగిరి ఉపాధ్యాయులకు పాఠశాల సహాయకులుగా ఉద్యోగోన్నతులు పొందారు. ఈ మేరకు శనివారం ఐటిడిఎ పిఒ, డిడి ఆధ్వర్యంలో జరిగిన పదోన్నతుల కౌన్సిలింగ్‌లో 49 మంది వివిధ కేటగిరిలకు చెందిన ఉపాధ్యాయులను పాఠశాల సహాయకులుగా పదోన్నతులు కల్పించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను అభ్యర్థులకు పిఒ విష్ణుచరణ్ అందజేశారు. కార్యాక్రమంలో డిడి ఎం.రుక్మాంగదయ్య, ఎస్.శ్రీనివాసరావు, ఎఎంఒ, పిఎంఆర్‌సి పాల్గొన్నారు.



ఎఎన్ఎంనుద్దేశించి మాట్లాడుతున్న సాయిప్రసాద్

ఎఎన్ఎంలపై పనిభారం తగ్గించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గ్రామ సచివాలయ ఎఎన్ఎంలపై పని భారం తగ్గించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో యూనియన్ నాయకులు డి.రమాదేవి అధ్యక్షతన జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.మాధవి, నాయకులు సాయిప్రసాద్ మాట్లాడుతూ, గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఎఎన్ఎంలపై ప్రభుత్వం ఒత్తిడికి గురి చేస్తుందని, వర్క్ పెర్ఫార్మెన్స్ టార్గెట్ పేరుతో వారికి పనిచేయని ట్యాబులు, షుగర్ వ్యాధి, బిపి టెస్టులు, రక్త నమూనా సేకరణలో నాణ్యమైన రిపోర్టులు అందించలేదని వారిని తొలగించడానికి సోకాజ్ నోటీసులు ఇవ్వడం, సస్పెండ్ చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వం నాణ్యమైన వైద్య పరికరాలను అందించకుండా ఆ తప్పులను సిబ్బందిపై నెట్టడం సమంజసం కాదని, రాష్ట్రంలో ఇటీవల ఆరుగురు ఎఎన్ఎంలను తొలగించిన సంఘటనే ఉదాహరణ అన్నారు. గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న సచివాలయ ఎఎన్ఎం (గ్రేడ్ 3 సిబ్బందిని)ను ఎంపిహెచ్ఎ ఫిమేల్‌గా ప్రమోట్ చేయాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, అందుకు తగిన శిక్షణ ఇవ్వాలని, జనాభా ప్రతిపాదించిన అదనపు సిబ్బందిని నియమించాలని, రికార్డుల నిర్వహణలో తగిన తర్ఫీదును ఇవ్వాలని, యూనిఫాం అలవెన్స్‌తో పాటు వర్క్ పెర్ఫార్మెన్స్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ జిల్లా నాయకులు ఢిల్లీశ్వరి, పలువురు గ్రామ సచివాలయ ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

అంగన్‌వాడీల విజయోత్సవ సభలో ఎం.కృష్ణమూర్తి



గుమ్మలక్ష్మీపురంలో జరిగిన అంగన్‌వాడీల విజయోత్సవ సభలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఐక్య పోరాటాలతోనే న్యాయమైన డిమాండ్ల పరిష్కారమవుతాయని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ విజయోత్సవ సభను నిర్వహించారు. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ పాలన సాగిస్తుందన్నారు. ఒకవైపు కార్పొరేట్ శక్తులకు కొమ్ము కోస్తూ మరోవైపు మతోన్మాద పార్టీగా పాలన సాగిస్తోందన్నారు. మోడీ హయంలో కార్మికులకు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత పూర్తిగా కరువైందన్నారు. విగ్రహ ప్రతిష్టలకు ఇస్తున్న ప్రాధాన్యత ప్రజలు, ఉద్యోగుల సంక్షేమంపై లేదన్నారు. తన స్వార్ధ రాజకీయాల కోసం రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను కూడా పూర్తిగా రద్దు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడంతో కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల కోసం నెలరోజులకు పైగా రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేసినా పూర్తిస్థాయిలో సమస్యలకు పరిష్కారం చూపలేదన్నారు. మోడీ విధానాలనే రాష్ట్రంలో అమలు చేస్తున్నారని విమర్శించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలపై భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంఘటితంగా పోరాటం చేయడం వల్లే 11 డిమాండ్లలో 10 డిమాండ్లకు పరిష్కారం చూపించారని అన్నారు. జీతాల పెంపుదల విషయం నెరవేర్చకపోవడం విచారకరమన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మనం సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్వాడీ సమస్యలపై పోరాటాలకు ప్రభుత్వం అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసిన భయపడకుండా పోరాటం చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, కోశాధికారి మండంగి రమణ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు కస్తూరి, సత్యవతి, సిఐటియు నాయకులు కె.గౌరీశ్వరరావు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ పోరాటం చిరస్మరణీయం

పాచిపెంట : అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు 43రోజుల పాటు చేపట్టిన పోరాటం చిరస్మరణీయమయని, ఎన్ని ఆటంకాలు వచ్చినా పోరాడి హక్కులు సాధించుకోవడం అభినందనీయమని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి అన్నారు. పాచిపెంటలోని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల అభినందన సభ ఆదివారం జరిగింది. ఈ అభినందన సభలో ఉమామహేశ్వరి మాట్లాడుతూ ఇంకా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసి సమాన పనికి సమాన వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని అర్థం చేసుకొని వారి డిమాండ్ల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. అధునాతనమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు లేకుండా చూడాలని, ఐసిడిసిస్ నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విధానాలను ఎండగడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఐసిడిఎస్‌ను బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ విజయనగరం జిల్లా నాయకులు వి.లక్ష్మి మాట్లాడుతూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పోరాడి హక్కులు సాధించుకున్న అంగన్‌వాడీ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని పోరాటాలు చేసి ఉద్యమాల ద్వారా తమ న్యాయమైన హక్కులు సాధనకై సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాల్లో ముందు భాగాన నిలబడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలోనే సుర్రుమంటున్న సూరీడు

రాత్రి చల్లదనం, పగలు మండుటెండలు

పగటిపూట 30- 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



ప్రజాశక్తి - కురుపాం

ఫిబ్రవరి తొలినాళ్లలోనే సూరీడు సుర్రుమంటున్నాడు.. సహజంగా శివరాత్రికి చలి 'శివశివ' అంటూ పోయి, వేసవి ప్రారంభమయ్యేది. అయితే గడిచిన నాలుగైదు ఏళ్లుగా వాతావరణంలో సంభవించిన పెనుమార్పుల వల్ల ఫిబ్రవరి చివరిలోనే ఎండలు మండుతూ వస్తున్నాయి. కరోనా సమయంలో వేసవి కొంత కనికరం చూపింది. అయితే ఈ ఏడాది భానుడి ప్రతాపం ఎక్కువేనని వాతావరణ ముందే హెచ్చరికలు జారీ చేసింది. దీనికితగ్గట్టే ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండలు మండుతున్నాయి. మన్యం జిల్లాలో పగటిపూట 30-35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో ఇళ్లల్లోనూ, ఆఫీసుల్లోనూ ఎసిలు 'ఆన్' అయ్యాయి. ఈ ఏడాది వేసవి ముందే వచ్చేసింది. ఫిబ్రవరి మూడో వారంలోనే భానుడి ప్రతాపం కనిపిస్తోంది. గతంలో మార్చి 15 నుంచి ఎండాకాలం మొదలయ్యేది. విద్యార్థులకు ఒంటి పూట బడులు అప్పుడే మొదలయ్యేవి. ఈసారి వాతావరణంతో ఫిబ్రవరిలో ఏమాత్రం పగటిపూట చల్లగా ఉండడం లేదు.

ఏప్రిల్, మే నెలల్లో 40-46 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత

ఫిబ్రవరిలోనే ఉష్ణోగ్రతలు ఎక్కువగా మొదలు కావడంతో ఏప్రిల్, మేలో పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంటున్నారు. గత ఏడాది మన్యంలో మేలో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైన సందర్భాలున్నాయి. ఈసారి ఏప్రిల్, మే నెలలో పగటి పూట ఉష్ణోగ్రతలు కొంత వరకు పెరిగే అవకాశం ఉన్నాయి. మన్యంలో అడవుల విస్తీర్ణంలో తగ్గుతూ ఏటేటా పచ్చదనం తగ్గిపోతూ ఉండడంతో ఉష్ణోగ్రతలు పెరిగి వేడి గాలులు వీచే అవకాశాలు ఉన్నాయి. ఏదిఏమైనా ప్రకృతి సమతుల్యత పాటించకపోవడం వల్ల జీడి మాడి పోక తప్పదు. తాగునీటి సమస్యా తలెత్తే ప్రమాదం ఉంది.

కెరీర్ గైడెన్స్‌పై యువతకు అవగాహన



కెరీర్‌గైడెన్స్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐ బాబు, సిబ్బంది

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించి కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని టౌన్ సిఐ జిడి బాబు చెప్పారు. ఆదివారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆయన స్టేషన్ సిబ్బందితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎక్కడైనా సారా, గంజాయి రవాణా, నాటుసారా తయారీకి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. సారా, గంజాయి వినియోగానికి అలవాటు పడిన యువకులు మత్తులో ఏ పని చేస్తున్నారో తెలుసుకోలేని స్థితిలో వుంటున్నారని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొని బంగారు భవిష్యత్తు పాడు చేసుకోవద్దని సూచించారు. పోలీసు, ఆర్మీ రిక్రూట్మెంట్, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువకులు తమను సంప్రదిస్తే తగిన సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

పట్టణంలో ఇటీవల కొన్ని రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లు చించివేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని సిఐ బాబు చెప్పారు. ఎన్నికల ముందు ఇలాంటి చర్యల వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని చెప్పారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి సమాచారం అందిస్తే తగిన బహుమతి అందజేయనున్నట్లు సిఐ బాబు చెప్పారు.

బొడ్డమానుగూడలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని బొడ్డ మానుగూడలో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. దీంతో ఈ గ్రామ గిరిజనుల భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు గ్రామాల్లోకి చొరబడి దాడిచేస్తాయోనని గిరిజనులు కంటిమీద కొనుక్కు లేకుండా బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఏనుగుల బారి నుంచి రక్షించాలని ఇప్పటికే గిరిజనులు అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నారు ఏనుగుల సంచారంతో కొండపోడుకు వెళ్లాలంటే భయమేస్తుందని ఆందోళన చెందుతున్నారు అంతేకాక సమీపంలో వేసిన పంటలు, కొండచిపుర్లు, అరటి, కంది తదితర పంటలను ధ్వంసం చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు

టెన్త్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



టెన్త్ విద్యార్థి ఇంటికి వెళ్లి ఆరా తీస్తున్న ప్రత్యేక అధికారి ప్రసాద్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పదో తరగతి విద్యార్థుల పరీక్షల సన్నద్ధతపై నియమించిన ప్రత్యేక అధికారులు రాత్రివేళల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, పర్యవేక్షణ జరిపే కార్యక్రమం మండలంలో కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కెఎస్ ప్రసాద్ పుట్టురు, పెదబొండపల్లి గ్రామాలు పర్యటించి విద్యార్థులు ఎలా చదువుతున్నదీ వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి 18 నుండి జరగనున్న పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. ఒక జిల్లా అధికారి ఇలా గ్రామాల్లో విద్యార్థుల ఇళ్లను సందర్శించి, వారిని ప్రోత్సాహించడం గొప్ప విషయం అని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అమరపు సూర్యనారాయణ అన్నారు. తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో వ్యవసాయ అధికారి క్రాంతి కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు దావీదు పాల్గొన్నారు.

వీరఘట్టంలో... భూకబ్జాల పర్వం


అక్రమణలకు గురైన వెంకమ్మ సాగరం

ప్రజాశక్తి - వీరఘట్టం

'వద్దంటేడబ్బు మానోన్దైతే కడబండితో కూర్చొనా ఎలాంటి నోటుండు' అన్న చందంగా ఉంది మండలంలోని భూఆక్రమణదారుల పరిస్థితి. పాలకులు, అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో భూ కబ్జాలకు అంతులేకుండా పోతుంది. చెరువులు, గెడ్డలు, కాలువలు ఇలాంటి కంటికి ఖాళీగా స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేయడమే తరువాయి. ఇంత జరుగుతున్నా కనీసం అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఇందుకు నిదర్శనం మండలంలోని పలు పంచాయతీల్లో చోటు చేసుకున్న భూకబ్జాలే నిదర్శనం.

మండలంలోని యు.వెంకంపేట పంచాయతీ పరిధిలో వెంకమ్మ సాగరం సర్వే నెంబరు 4లో 116.81 ఎకరాలు, సర్వే నెంబరు 203లో 22.36 ఎకరాల విస్తీర్ణంలో దాదాపుగా 139.17 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన చెరువు కబ్జాకోరల్లో చిక్కుకుపోయింది. అధికారుల నిర్లక్ష్యంతో కేవలం 60 ఎకరాల విస్తీర్ణమే చెరువు మిగిలింది. దీన్నిబట్టి చెరువు ఎంత విస్తీర్ణంలో కబ్జా అయ్యిందో అర్థం చేసుకోవచ్చును. అలాగే మండలంలోని చలివేంద్రి పంచాయతీ పరిధి గల బూరుగ గ్రామానికి సమీపాన రాజా చెరువు సర్వే నెంబరు 462లో 52.60 ఎకరాల్లో విస్తీర్ణం. ప్రస్తుతం ఈ చెరువు కనీసం 30 ఎకరాల విస్తీర్ణం కూడా కనిపించడంలేదు. మండలంలో అతిపెద్ద చెరువుల్లోనే ఎంకమ్మ సాగరం, రాజ చెరువు అప్పట్లో విశాలంగా ఉండి పుష్కలంగా సాగునీరు ఉండడంవల్ల ఏడాదికి రెండు పంటలు సాగు చేసేవారమని ఆయకట్టు రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుతం చెరువులు కబ్జాకు గురవ్వడంతో ఏడాదికి ఒకసారి పంట సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. అలాగే మండలంలోని కంబరవలస సమీపాన గల విశ్రాగ్ చెరువు సర్వేనెంబర్ 313లో 18.29 ఎకరాలు విస్తీర్ణంలో రికార్డులో ఉన్నట్లు అధికారులు గణంకాలు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఎకరా 50 సెంట్లు విస్తీర్ణంలో ఈ చెరువు దర్శనమిస్తుందంటే ఎంతమేర అక్రమణకు గురైందో వీటిని చూస్తే అర్థం చేసుకో వచ్చు. మండలంలోని తెట్టంగిలో సర్వే నెంబరు 189లో కోనేరు చెరువు 1.20 ఎకరాల విస్తీర్ణంలో చెరువు గర్భం ఉన్నప్పటికీ కొంతమంది ఆక్రమణదారులు కబ్జా చేసేందుకు కొద్ది నెలల కిందట జెసిబితో కప్పి వేశారు. ఈ విషయమై అప్పట్లో కొంతమంది రైతులు అప్పటి పాలకొండ సబ్ కలెక్టరు నూరుల్ కమర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించి ఆ గ్రామానికి వెళ్లి చెరువు గర్భాన్ని పరిశీలించారు. ఆక్రమణకు గురైందని గుర్తించి సిబ్బందిచే కప్పి వేసిన చెరువును యథావిగా తయారు చేశారు. ఇలా చెప్పుకుపోతే మండలంలోని అనేక చెరువులతో పాటు గెడ్డలు, వాగులు, ఇతర ప్రభుత్వ భూములు అనేక చోట్ల భూకబ్జాకు గురవుతుంటే అంతులేకుండా పోతుందని స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

• అనుమతుల్లేకుండా నిర్మాణాలు • పట్టించుకోని అధికారులు

ఇష్టానుసారంగా నిర్మాణాలు

మండల కేంద్రంలోని వట్టిగెడ్డ వద్ద ఎటువంటి అనుమతుల్లేకుండా దేవుడి పేరు చెప్పి భూకబ్జాలు చేసి భవనాలు నిర్మిస్తున్నారు. అలాగే స్వామి థియేటర్‌కు సమీపాన గల కోనేరు చెరువు గట్టుపై ఎటువంటి అనుమతుల్లేకుండా దేవాలయాల పేరు చెప్పి భూకబ్జాలు చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. మండలంలో భూముల ధరలు అధికంగా ఉండడంతో దేవుడి పేరు చెప్పి ఎక్కడికక్కడే భూ కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. భూకబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ కనీసం అధికారులు ఆక్రమణదారులపై చర్యలు చేపట్టకపోవడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


వీరఘట్టం కోనేరు చెరువు వద్ద అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలు

ఖర్చు చేస్తున్నా ఫలితం లేదు

వెంకమ్మ సాగరం, రాజ చెరువులో ప్రతి ఏటా ఉపాధి హామీ పథకం ద్వారా లక్షలాది రూపాయలు వెచ్చించి పనులు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోతుంది. లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ ఆక్రమణలు మాత్రం తొలగించడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి హామీ చట్టం ద్వారా ఆక్రమణలు తొలగితాయన్న ఆశ అయితే కనిపించడం లేదని, పనులు చేస్తున్నామని చెప్పుకోవడమే తప్ప ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని చోటు చేసుకున్న ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూములను కాపాడాలని రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.

కవితలతో ఆకట్టుకున్న స్వామినాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నూరేళ్ల వేడుక సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ శనివారం హైదరాబాద్ ఆర్ట్స్ కాలేజ్ లో నిర్వహించిన "కవితాపాదు" సాహిత్య వేదికపై పార్వతీపురానికి చెందిన ప్రముఖకవి సిరికి స్వామినాయుడు కవితాపఠనం చేశారు. ప్రొఫెసర్ కాశిం అధ్యక్షతన ప్రముఖ జానపద వాగ్గేయకారుడు గోరటి వెంకన్న ముఖ్య అతిథిగా జరిగిన వచన కవితాపఠనంలో స్వామినాయుడు 'ఉద్యానమా.. ఊపిరి తీసుకో..' అనే కవితలో ఆ ప్రాంతంలో మూత్రపిండాల వ్యాధులతో సంభవిస్తున్న అకాల మరణాలపై కరుణ రసాత్మకమైన కవితను, అలాగే 'ఒక స్వప్నం కోసమే ..' అనే కవితలో ఊరి వెలివాడల్లో బతుకుతున్న మాల మాదిగ నిమ్నకులస్తుల అంత్యక్రియలు చేసుకునేందుకైనా ఒక స్మశానం కూడా లేని దుర్భరస్థితిని హృదయ విదారకంగా ఆలపించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించారు. ఈ సభలో ప్రముఖ రచయితలు కె.శివారెడ్డి, ఎన్.గోపి, జయధీర్ తిరుమలరావు, ఆంధ్రశ్రీ, ఏపూరి సోమన్న "ఉభయ తెలుగు రాష్ట్రాల సుప్రసిద్ధ కవులు, పాటకులు, రచయితలు పాల్గొన్నారు.


విజయరాంపురం వద్ద ప్రమాదకరంగా మారిన కాజ్‌వే

ప్రమాదకరంగా రహదారి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దెబ్బగెడ్డ పంచాయతీ పరిధిలోని విజయరాంపురం– అనసభద్ర మధ్యలో రహదారి ప్రమాదకరంగా మారింది. ఇటీవల మెట్టవలస– విజయరామపురం మధ్య బిటి రహదారి మంజూరైంది. ఈ రహదారికి అవసరమైన ముడి సరుకు టిప్పర్లు తెస్తుండడంతో ఈ రహదారి పాడైపోయిందని స్థానికులు అంటున్నారు. విజయరాంపురం కాజ్‌వే సమీపంలోని సిమెంటు రహదారి ఇలా కృంగిపోవడంతో ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ గొయ్యి విజయరాంపురం నుంచి వచ్చే వాహనచోదకులకు ప్రమాదకరంగా మారిందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతిని కాంక్రీట్‌తో పూడ్చివేసి సిమెంట్ రహదారి యధాతధంగా చేయాలని కోరుతున్నారు.


మక్కువలో పర్యటిస్తున్న తేజోవతి

ప్రచారంలో దూకుడు పెంచిన తేజోవతి

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలో టిడిపి ఆశావాహి అభ్యర్థి తేజోవతి ప్రచారంలో దూకుడు పెంచారు. అన్ని మండలాల్లో ప్రచార పర్వం కొనసాగిస్తున్నారు. ఇంతవరకు ఆమె నాలుగు మండలాలు, పట్టణంలో ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో తనకు టికెట్ వస్తే సహకరించాలని అభ్యర్థిస్తున్నారు. ఆదివారం మక్కువ మండలంలో పలు గ్రామాల్లో కార్యకర్తలు అభిమానుల శుభకార్యాలకు హాజరయ్యారు. గడచిన మూడు రోజులుగా ఆమె సాలూరు, మెంటాడ మండలాల పరిధిలో గ్రామాల్లో పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ ఆశీస్సులు, సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు అండతో ఆమె తనదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. మరి కొద్ది రోజుల లో పార్టీ నాయకత్వం అభ్యర్థుల జాబితా ప్రకటించే అవకాశం ఉండడంతో ఆమె స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి పార్టీ గెలుపు కోసం కృషి చేస్తున్నారు.

కంచరపాడు ప్రజలను ఆదుకోవాలి

ప్రజాశక్తి -కొమరాడ

మండలంలోని కంబవలస పంచాయతీ కంచరపాడు గ్రామ గిరిజనులను అధికారులు ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ గ్రామంలో 44 గిరిజన కుటుంబాలు ఉన్నాయన్నారు. వీరు అటు ఒడిశా, ఇటు ఆంధ్రా సరిహద్దు గ్రామంలో జీవిస్తున్నారని తెలిపారు. 2015లో సంభవించిన అగ్ని ప్రమాదంతో ఊరంతా బూడిదైందన్నారు. ఆ సమయంలో బాధితులకు రూ.15 వేలు ఆర్థికసాయం అందజేసి అధికారులు, పాలకులు చేతులు దులుపుకున్నారన్నారు. అయితే అధికారులు మాత్రం ఒక్కొక్క బాధితునికి రూ.లక్షా90వేలు ఇచ్చినట్లు స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి తమకు జాబితా వచ్చిందన్నారు. అయితే తమకు అందింది కేవలం రూ.15వేలే తప్ప ఒక్క పైసా కూడా అదనంగా ఇవ్వలేదని గ్రామపెద్దలు ఎం.ధర్మారావు, కె.రాముడు, కె.మోహన్‌రావు, ఎర్రన్న, ఎం.జనార్ధన ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై పూర్తిస్థాయిలో ఉన్నతాధికారులు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.


టెన్త్ విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు

ఇష్టపడి, కష్టపడితే నూరు శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థులు పదో తరగతిలో ఇష్టపడి కష్టపడితే పదిశాతం ఉత్తీర్ణతతో పాటు అధిక శాతం మార్కులు సాధించవచ్చునని భారతీ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.నవీన్ కుమార్, కరస్పాండెంట్ ఎస్‌పి పెంటయ్య అన్నారు. మండలంలోని పులిపుట్టి సమీపాన గల ఈ స్కూల్లో పదో తరగతి విద్యార్థుల ఫేరివెల్ డే కార్యక్రమంలో ప్రిన్సిపల్, కరస్పాండెంట్ మాట్లాడారు. ఈ సందర్భంగా కష్టేఫలే, కష్టానికి తగిన ప్రతిఫలం ఉంటుందన్నారు. మీ ఆలోచనలు చదువుపై ఉంచి, ఇష్టపడి చదవాలన్నారు. మీ చదువు మీకు, మీ తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకొచ్చేలా ఉండాలని అన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రణాళికా ప్రకారం చదివితే ఉత్తీర్ణత తప్పనిసరిగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీమోహన్, దివాకర్, సురేష్, మురళి, వెంకటేశ్వర్లు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

20న చిదిమిలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమిలో ఈనెల 20న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎస్.సాల్మన్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమయపాలన పాటించి వైద్య, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.

9 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని విశ్వనాధపురం శివారులో తొమ్మిది మంది పేకాటరాయిళ్లను అరెస్టు చేసినట్లుఎస్సై పి నారాయణ రావు తెలిపారు. ముందస్తు సమాచారంతో మేరకు ఆదివారం సాయంత్రం సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి నిర్వహించగా 9 మంది పట్టుబడగా వారి నుంచి రూ.5860 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

సిఐటియులో సెక్యూరిటీ గార్డులు, కార్మికుల చేరిక

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఏరియా ఆసుపత్రిలోని పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు, సెక్యూరిటీగార్డులు 30 మంది సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు సమక్షంలో సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారానికి జీవోల కోసం ఒకసారి పోరాటం చేస్తే, ఆ జీవోల అమలు కోసం మరోసారి పోరాట చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మిక సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే శరణ్యమని పిలుపునిచ్చారు. ఏరియా ఆసుపత్రి ఆవరణంలో జరిగిన సమావేశంలో పాలకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ అండ్ సెక్యూరిటీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ అధ్యక్షులుగా కె.అప్పన్న, ఉపాధ్యక్షులు ఎన్ జయరాజు, పి.గున్నమ్మ, ప్రధాన కార్యదర్శిగా టి.జయనారాయణ, కార్యదర్శిగా ఎ.ప్రసాదు, డి.రవి, కోశాధికారిగా ఆర్.రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఎ.కృష్ణ, కె.నీలిమ తదితరులను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యక్రమంలో మండల సిఐటియు సమన్వయ కమిటీ కార్యదర్శి కాదా రాము శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్‌లు పాల్గొన్నారు.



సిఐటియులో చేరిసన సెక్యూర్టీ గార్డులు, పారిశుధ్య కార్మికులు

'సూపర్ సిక్స్'పై గ్రామాల్లో ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం :

ప్రజల భవిష్యత్తుకు భరోసా కావాలంటే చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతోనే సాధ్యమని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. మండలంలోని గుజ్జువాయి పంచాయతీలో గల డి.కొత్తగూడ, ఎన్.కొత్తగూడ, ఎగువ కొత్తగూడ, గోర్జంగూడ, బుగన్నగూడ గ్రామాల్లో మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో జరిగి వంటి సూపర్ సిక్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జులు నాగేశ్వరరావు, గుడారి వెంకటరమణ, బిడ్డిక కడాయి, మాజీ సర్పంచ్ సుబ్బలక్ష్మి, నాయకులు కె.మల్లేసు, బి.బాలరాజు, వెంకటరమణ, గవరయ్య, గౌరి, భాస్కరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ :టిడిపి అధికారంలోకి తీసుకువస్తే సూపర్ సిక్స్ వంటి పథకాలతో రాష్ట్రంలో పేదరికం రూపుమాపేందుకు కృషి చేస్తామని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయ్ చంద్ర అన్నారు. పట్టణంలోని కొత్తవలస ఐదో వార్డులో ఆదివారం నిర్వహించిన బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన స్థానిక కార్యకర్తలు, నాయకులతో కలిసి వార్డులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి మహాలక్ష్మి ఉచిత గ్యాస్, నిరుద్యోగ భృతి వంటి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, పట్టణ టిడిపి అధ్యక్షుడు రవికుమార్, కౌన్సిలర్లు కోల మధు సరిత, నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, వారణాసి నాగేశ్వరరావు బుడితి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.


కురుపాం : ప్రచారం చేస్తున్న తోయక జగదీశ్వరి

టిడిపిలోకి 50 కుటుంబాలు చేరిక

భామిని : వైసిపి పాలనతో విసుగు చెందిన 50 కుటుంబాలు టిడిపి లోకి చేరాయని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ తెలిపారు. బాలేరులో వలురౌతు బల్లన్న ఆధ్వర్యంలో వైసిపికి చెందిన 50 కుటుంబాలు టిడిపిలోకి చేరాయి. వీరిని జయకృష్ణ టిడిపి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమం టిడిపి ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, మండలం అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, టిడిపి మండలి కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువు కబ్జాలపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎపి చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సిసిఎల్ఎ) ఆదేశానుసారం పార్వతీపురంలో కబ్జాకు గురైన చెరువుల కబ్జాపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు, పట్టణ అధ్యక్షులు శిగడాం భాస్కర రావులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో కబ్జాకు గురవుతున్న చెరువులను రక్షించాలని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిసిఎల్ఎకు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిసర్ల మాలతి, కష్ణమూర్తి తదితరులు ఫిర్యాదు చేశారన్నారు. ఆ ఫిర్యాదు మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ సీసీఎల్ఎ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సిసిఎల్ఎ ఆదేశాల ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువుల్లో కబ్జాలకు సంబంధించి ఇటీవల అధికార, ప్రతిపక్షాల నాయకులు బహిరంగంగా విమర్శలు చేసుకొని, ఒకరిపై ఒకరు ఆరోపించుకుంటూ చెరువుల్లో నిర్మితమైన పక్కా భవనాలను మీడియా ముఖంగా చూపెడుతున్నా సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం లేదన్నారు. రోజురోజుకు కబ్జాలు పెరిగి చెరువులు కనుమరుగవుతున్నా కనీసం అధికారులు స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సీసీఎల్ఎ ఆదేశాల ప్రకారం చెరువుల్లో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను తొలగించాలన్నారు. ఆక్రమణ జరిగే సమయంలో ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కబ్జాదారులపై క్రిమినల్ చర్య చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ చర్యలు చేపట్టని పక్షంలో న్యాయపరమైన పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

కొండవాగు నీరే తాగునీరు

ప్రజాశక్తి -భామిని

ప్రభుత్వాలు తాగు నీటి కోసం నిధులు వెచ్చిస్తున్నా గిరిశిఖ గ్రామ గిరిజనులకు మాత్రం గుక్కెడు నీటి కోసం అనేక అవస్థలుపడుతున్నారు. వివరాల్లోకొ వెళ్తే నూతన నల్లారాయిగూడ పంచాయతీలోని డోకులగూడ, బొడ్డగూడ పంచాయతీ పరిధిలో గేదెలగూడ, నడిమిగూడ గ్రామస్తులు తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారు. గుక్కెడు నీటి కోసం కొండల్లోని ఇంకుడు గుంటలపై ఆధారపడుతున్నారు. సుమారు 60 కుటుంబాలున్న ఈ మూడు గిరిజన గ్రామాల ప్రజలు తాగు నీటి కోసం, పరిసర కొండలపై 8 అడుగులు లోతులో ఇంకుడు గుంటను తవ్వి, ఆ గుంటలకు పైపును అమర్చి, ఏటావాలుగా కిందకు దించుతున్నారు. ఆ ఇంకుడు గుంట నీరు కలుషితమైనా వాటినే తాగడానికి, ఇతర అవసరాలకు వాడుకునే పరిస్థితి. ప్రస్తుతం ఆ ఇంకుడు గుంటకు ఏర్పాటు చేసిన పైప్ నుంచి కొద్ది పాటి నీరు వస్తుందని, ఈ నెల చివరికి అది పూర్తి స్థాయిలో ఎండిపోతుందని అన్నారు. స్థానికంగా ఉన్న చిన్న బావిపైనే అందరూ ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ చిన్న బావి కూడా 3,4 నెలల్లో నీరు దొరకని పరిస్థితి. ప్రతి ఏటా వేసవి ఈ సమస్యను ఎదుర్కొంటున్నామని, రానున్న వేసవికి అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.


కొండ వాగు నుంచి వచ్చే నీటిని డ్రమ్ముల్లో నింపుతున్న గిరిజనులు


గడగమ్మలో నిరుపయోగంగా ఉన్న ఇంటింటి కుళాయి కనెక్షన్లు

కుళాయిలు సరే నీరేది ...!

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామంలో కుళాయి పాయింట్లు ఏర్పాటు చేశారు గానీ నీరందించడం లో అధికారులు విఫలమ య్యారని మండలంలోని గడగమ్మ గ్రామస్తులు విమర్శి స్తున్నారు. గ్రామంలో లక్షలాది రూపాయలతో ఇంటింటికి కుళాయి పాయిం ట్లు ఏర్పాటు చేయడంతో రెండు బోరు బావులు తవ్వకాలు జరిపారని, దాదాపుగా నెల రోజులు కావస్తున్నప్పటికీ ఎటువంటి పరికరాలు అమర్చకపోవడంతో ఇంటిముందు ఉత్సవ విగ్రహంలా కుళాయి పాయింట్లు దర్శనమిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇంటింటికీ కుళాయి పాయింట్లు వచ్చాయని ఎంతో ఆశపడితే నిరాశ మిగిలిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పది బోరు బావులున్నప్పటికీ వాటి ద్వారా వచ్చే నీరు తాగేందుకు పనికి రాకపోవడంతో సమీపంలో ఉన్న నాగవళి నది వద్దకు వెళ్లి చెలమల ద్వారా నీరు తోడుకొని తీసుకువచ్చి దాహార్తిని తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ఇంటింటికీ ఏర్పాటు చేసి, కుళాయి పాయింట్లు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

వైసిపితో పేదలకు మేలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వైసిపి పాలనలో రాష్ట్రంలోని పేదలకు ఎనలేని మేలు జరిగిందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని లక్ష్మీనారాయణ పురం గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నమైన రీతులలో అవినీతికి తావు లేకుండా పేదలకు సంక్షేమ పథకాలు అందించిందన్నారు. కావును రాబోయే ఎన్నికల్లో వైసీపీకి మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన్ రావు సర్పంచ్ జక్కు ప్రవీణ్ కుమార్ వైస్ ఎంపీపీలు బంకుర రవికుమార్ సిద్ధా జగన్నాధ రావు, తదితరులు పాల్గొన్నారు.


ధ్వంసం చేసేందుకు సిద్ధం చేసిన నాటుసారా

857 లీటర్ల నాటుసారా ధ్వంసం

ప్రజాశక్తి - కురుపాం

ఇటీవల ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో గల నీలకంఠాపురం, ఎల్విన్ పేట, కురుపాం పోలీస్ స్టేషన్ల పరిధిలో 22 నాటు సారా కేసుల్లో పట్టుబడిన 857.6 లీటర్ల నాటు సారాను ఆదివారం కురుపాం ఓల్డ్ కాంప్లెక్స్ ఆవరణంలో పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారు చేసినా అమ్మినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.64,710కు వాహనాలు వేలం

స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇటీవల నాటుసారా కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర డిఎస్‌పి జివి కృష్ణారావు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. వాహన వేలం పాటలో పాల్గొన్నవారు నాలుగు ద్విచక్ర వాహనాలను రూ.64,710 వేలంపాటలో వెళ్లాలని స్థానిక ఎస్ఐ ఎస్.షణ్ముఖరావు తెలిపారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సిఐ పి.సత్యనారాయణ, ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్, నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠం స్థానిక ఎస్ఐ ఎస్.షణ్ముఖరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.